

మహిళకి ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సీఎం సహాయనిధి చెక్కులు అందజేత

సరూర్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్‌వోసీ(లెటర్ ఆఫ్ క్రెడిట్)లను ఆదివారం జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి వర్గాల వారికి సీఎం సహాయనిధి పథకం ఎంతో ఉపయోగపడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో నాదర్‌గుల్ మాజీ కౌన్సిలర్ యెల్చల మమతాసుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ అధ్యక్షుడు కోటగిరి జంగయ్య, నాయకులు విజయ్‌కుమార్, దండు యాదయ్యయాదవ్, నరేశ్‌చారి, శశిపాల్‌గౌడ్, కదారి సందీప్‌యాదవ్, రమేశ్‌యాదవ్, పెంటయ్యగౌడ్ పాల్గొన్నారు.

కాలనీ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

సరూర్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ ఓంసాయికాలనీలో ఓపెన్ నాలాతో ఇబ్బందులు పడుతున్నామని, దానిని అండర్ గ్రౌండ్ డ్రైనేజీగా మార్చాలని కాలనీవాసులు ఎమ్మెల్యే సబితారెడ్డిని కోరారు. ఈ మేరకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిసి వినతిపత్రం అందజేశారు. ఓపెన్ నాలా కారణంగా కాలనీలో దుర్వాసన వ్యాపిస్తున్నదని, దోమలు వృద్ధిచెంది స్థానికులు రోగాలబారిన పడుతున్నారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా నాలాను భూగర్భ డ్రైనేజీగా మార్చడానికి అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయించి పనులు జరిగేలా చూస్తానని సబితారెడ్డి వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్‌యాదవ్, బీఆర్ఎస్ మీర్‌పేట్ శాఖ అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కాలనీ ప్రతినిధులు సుదర్శన్ రెడ్డి, కృష్ణమాచారి, విజయ్, కిషోర్, శ్రీధర్, కుమార్ పాల్గొన్నారు.



మార్నింగ్‌వాక్‌లో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా

హయత్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ డివిజన్‌లోని హనుమాన్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆదివారం మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్లు వేయాలని కోరారు. అనంతరం మహాగాయత్రినగర్ కాలనీలో దీర్ఘకాలికంగా ఉన్న సీసీ రోడ్డు సమస్యను పరిష్కరించినందుకు కాలనీ సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌ను అభినందించి సన్మానించారు. మధురానగర్‌కాలనీలో సీసీరోడ్లు నిర్మించాలని కాలనీ వాసులు కార్పొరేటర్‌ను కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీను, నాయకులు విఠల్, దేవ్‌సింగ్, లింగం, రవీందర్, నరేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి: శ్వేతారెడ్డి



బస్తీవాసుల సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్వేతారెడ్డి

సైదాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. ఆదివారం నీలం రాజశేఖర్‌రెడ్డినగర్(చింతల్‌బస్తీ)లో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. కొందరు కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం వల్ల జరుగుతున్న నిర్మాణ పనుల జాప్యంపై అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. స్పందించని కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్ పెట్టాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ శిరీష, బస్తీవాసులు కృష్ణ, రఘుపతి, శేఖర్, మహేష్, రవి, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: లచ్చిరెడ్డి



కార్పొరేటర్ లచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

వనస్థలిపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ సచివాలయనగర్ కాలనీ అభివృద్ధికి కృషిచేస్తానని స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. ఇటీవల ఏర్పడిన సచివాలయనగర్‌కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో కలవగా వారికి లచ్చిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న వీధి దీపాలు, వాటర్ బోరు, రోడ్లు మరమ్మతుల వంటి సమస్యలతో పాటు పార్కు అభివృద్ధికి సహకరించాలని అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్‌ను కోరుతూ వినతిపత్రం సమర్పించగా ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు పింగళి సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి గుత్తా బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు గడ్డమీది గోపాల్‌రెడ్డి, సాలాది అంజనేయులు, ఆలేటి రవికుమార్, సత్యనారాయణ, హేమ హరీష్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

మన్సూరాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలోని కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీనేత్రాలయ కంటి ఆస్పత్రి సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఐ డ్రాప్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సీనియర్ ఆప్తమాలజిస్ట్ సురేష్, సిబ్బంది రాము, సాయికృష్ణ, కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

మందకృష్ణమాదిగకు సత్కారం



మందకృష్ణమాదిగకు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ జర్నలిస్టు ఫోరం సభ్యులు

మన్సూరాబాద్: పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసిన తెలంగాణ జర్నలిస్టు ఫోరం సభ్యులు ఆయన్ను పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఇటీవల పద్మశ్రీ అవార్డును అందుకోవడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఫోరం గౌరవ సలహాదారు కడెంపల్లి వేణుగోపాల్‌గౌడ్, సురేంద్రరాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మత విద్వేషాలు రెచ్చగొట్టే పోస్ట్ చేసిన వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు

సైదాబాద్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఓ వర్గం మనోభావాలను దెబ్బతీసే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వ్యక్తిపై ఓ న్యాయవాది సైదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎక్స్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో మతపరమైన ఆచారాలను లక్ష్యంగా చేసుకుని అవమానకరమైన కంటెంట్ పోస్టు చేశారని న్యాయవాది కె. కరుణసాగర్ పేర్కొన్నారు. ఈ కంటెంట్‌ను పోస్ట్ చేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

ప్రణాళిక సరిగ్గా లేని కారణంగానే

- మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో పొంగిపొర్లుతున్న మురుగు
- తలెత్తిన తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

చాదర్‌ఘాట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో పొంగిపొర్లుతున్న మురుగుకు జీహెచ్ఎంసీ, జలమండలి అధికార యంత్రాంగం తప్పిదాలు బయటపడుతున్నాయి. జలమండలి ఆధీనంలో ఉన్న సీవరేజీ పైప్‌లైన్లకు అవుట్‌లెట్‌లు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు కలిపారనే ప్రణాళిక సరిగ్గా లేని కారణంగానే మురుగు సమస్య తలెత్తినప్పుడే ఈ తప్పిదాలు వెలుగు చూస్తున్నాయి. సీవరేజీ పైప్‌లైన్‌కు అవుట్ లెట్‌లను చాలా చోట్ల జీహెచ్ఎంసీ నిర్మించిన వరద నీటి కాలువలోకి కలిపి ఎక్కడికక్కడ చేతులు దులుపుకున్నారు. ఇలా సీవరేజీ పైప్‌లైన్లను వరదనీటి కాలువలోకి కలపడం, వర్షం కురిసినప్పుడు వరద ప్రవాహంతో మునిగినప్పుడో, వరదనీటి కాలువలు కూలినప్పుడో, వరదనీటి కాలువలు పూడికలతో నిండిపోయినప్పుడో ఇలాంటి తప్పిదాలు బయటపడుతున్నాయని ఒకవైపు జీహెచ్ఎంసీ, మరోవైపు జలమండలి అధికారులే ఎవరికి వారుగా అంగీకరిస్తున్నారు. తాజాగా మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో వరదనీటి కాలువ నుంచి పొంగి పొర్లుతున్న సీవరేజీ సమస్యతో ఇలాంటి తప్పిదాలు బయటికి వస్తున్నాయి.

1000కి పైగా ఇళ్ల సీవరేజీ కనెక్షన్లు ఇక్కడి వరద నీటి కాలువలోకే..

చంచల్‌గూడ, న్యూమలక్‌పేట, అక్బర్‌బాగ్ ప్రాంతాలకు చెందిన దాదాపు 1000కి పైగా ఇళ్ల నుంచి వెలువడే సీవరేజీ పైప్‌లైన్ కనెక్షన్లను కొన్నేళ్ల క్రితమే మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి ఉన్న వరదనీటి కాలువలోకి జలమండలి అధికారులు కలిపి చేతులు దులుపుకున్నారు. దాదాపు ఆరు అడుగులకు పైగా లోతైన వరదనీటి కాలువ మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి అక్బర్ ప్లాజా ముందు నుంచి మలక్‌పేట ఆర్‌యూబీ పక్కన ఓపెన్ నాలా వరకు నిర్మించారు. ఇందులోకి కలిసిన సీవరేజీ పైప్‌లైన్ నుంచి వచ్చి పడే పూడికలో ఏమేమి వచ్చి పడుతున్నాయోగాని ఆరు అడుగులకు పైగా లోతైన వరదనీటి కాలువలో మురుగు ప్రవాహాన్నే నిలిపివేసి జాతీయ రహదారిపైనే మురుగు పొంగిపొర్లింది. ఈ ఘటనతో మలక్‌పేట ఆర్‌యూబీ నుంచి వచ్చే వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో శనివారం నుంచి తలెత్తిన ట్రాఫిక్ సమస్య సోమవారం వరకు కూడా పరిష్కారమయ్యేట్లు కనిపించడం లేదు.



మలక్‌పేట నల్లగొండ చౌరస్తాలోని అక్బర్ ప్లాజా వద్ద మురుగును పరిశీలిస్తున్న చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, మలక్‌పేట సీఐ అశోక్‌కుమార్

మెట్రో పిల్లర్ నిర్మాణ సమయంలోనే వరదనీటి కాలువ ప్రహరీ దెబ్బతిన్నదా..

మెట్రోరైల్ ప్రాజెక్ట్‌లో భాగంగా మలక్‌పేట నల్గొండ చౌరస్తా మీదుగా నిర్మితమైన పిల్లర్ల నిర్మాణ సమయంలోనే ఇక్కడ వరద నీటి కాలువ బయటి పడి ఉంటుందని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులు భావిస్తున్నారు. అప్పట్లో వరదనీటి కాలువ పునర్నిర్మాణ సమయంలో ఎలాంటి చర్యలు చేపట్టారోగాని, అప్పట్లోనే జీహెచ్ఎంసీ, జలమండలి అధికార యంత్రాంగం దృష్టి సారించి ఉంటే తాజాగా తలెత్తిన పొంగిపొర్లుతున్న మురుగుతో ఇంతటి సమస్యలు తలెత్తివి కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.



కొనసాగుతున్న వరదనీటి కాలువ పనులు

జాతీయ రహదారి కింద కుంగిన వరదనీటి కాలువ ప్రహరీతోనే..

మలక్‌పేట నల్గొండచౌరస్తా నుంచి మలక్‌పేట ఆర్‌యూబీ వరకు జాతీయ రహదారి కింద ఉన్న వరద నీటి కాలువ ప్రహరీ కుంగిపోవడం వల్లే మురుగు పోయేందుకు వీలులేక రోడ్డు మధ్యలోనే మురుగు పొంగిపొర్లుతుంది. ఏడాది కాలంగా మురుగు పొంగిపొర్లడం, జలమండలి అధికారులు క్లీన్‌చేయడం అప్పట్లో సమస్య తాత్కాలికంగా పరిష్కారమయ్యేది. తాజాగా వరదనీటి కాలువ ప్రహరీ కుంగిపోవడంతోనే మురుగు పోయేందుకు వీలులేక రోడ్డుపైనే పొంగిపొర్లడం మొదలుపెట్టింది.

రూ.10లక్షలతో కాలువ పునర్నిర్మాణ పనులు

మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి మలక్‌పేట ఆర్‌యూబీ వరకు ఉన్న వరదనీటి కాలువ పునర్నిర్మాణ పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగుతున్నాయి. మొదట్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు పూర్తవుతుందని భావించారు. కానీ సోమవారం నాటికి పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు. ప్రస్తుతానికి ఎవరి తప్పిదాలని వాదించుకోకుండా జీహెచ్ఎంసీ, జలమండలి అధికార యంత్రాంగం సంయుక్తాధ్వర్యంలో సుమారు రూ.10లక్షల వ్యయంతో యుద్ధ ప్రాతిపదికన వరదనీటి కాలువ పనులు కొనసాగుతున్నాయి.

రూ.2.50కోట్లతో సీవరేజీ పైప్‌లైన్ నిర్మాణానికి ప్రతిపాదనలు

చాదర్‌ఘాట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో పొంగిపొర్లుతున్న మురుగుతో తలెత్తిన ట్రాఫిక్ సమస్య తీవ్రతను బయటపెట్టిన విషయం విదితమే. మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి వరదనీటి కాలువలో కలిసిన సీవరేజీ పైప్‌లైన్‌కు అవుట్‌లెట్ నిర్మాణానికి జలమండలి అధికార యంత్రాంగం తాజాగా రూ.2.50కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. చంచల్‌గూడ, న్యూమలక్‌పేట, అక్బర్‌బాగ్ తదితర ప్రాంతాల్లోని దాదాపు 1000కి పైగా ఇళ్ల నుంచి వెలువడే సీవరేజీ పైప్‌లైన్‌కు అవుట్ లెట్‌లోకి కలుపకుండా మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి ఉన్న వరదనీటి కాలువలోకి కలపడం వల్లే మురుగు సమస్య తీవ్రమైంది. మలక్‌పేట నల్గొండ చౌరస్తా నుంచి మలక్‌పేట ఆర్‌యూబీ వరకు దాదాపు అర కిలో మీటర్ వరకు సీవరేజీ పైప్‌లైన్ అవుట్ లెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద ఉన్న సీవరేజీ ట్రంక్ లైన్‌లోకి కొత్తగా రూ.2.50కోట్లతో నిర్మించబోయే సీవరేజీ పైప్‌లైన్‌ను కలపాలన్నది తాజా ప్రతిపాదన. ఇది కార్యరూపం దాల్చితే ఇటు వరదనీటి కాలువపై మురుగు ప్రవాహం ఒత్తిడి తగ్గిపోవడంతోపాటు సీవరేజీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించుకునే అవకాశముందని జలమండలి అధికారులు భావిస్తున్నారు.

అనాథ విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుంటా : అమిత్‌రెడ్డి



ప్రపంచ పాల దినోత్సవంలో చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

ఎల్బీనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అనాథ విద్యార్థి గృహ విద్యార్థులను అన్ని రకాలుగా ఆదుకుంటానని తెలంగాణ రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్(విజయడైరీ) చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ పాల దినోత్సవాలను ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ విద్యార్థులకు ప్రతీ రోజు 12లీటర్ల విజయ పాలను ఒక సంవత్సరం పాటు ఉచితంగా ఇస్తామన్నారు. ఈ రోజు నుంచే ఇది అమలు చేస్తున్నామని గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ సమక్షంలో అందజేశారు. అన్ని రకాల విజయ పాల ఉత్పత్తులను విద్యార్థులకు అందజేశారు. పిల్లలు ఆరోగ్యంగా, బలంగా ఉండాలని అందుకే మావంతుగా విజయపాలను, పాల ఉత్పత్తులు లస్సీ, పాల మిఠాయిలు క్రమం తప్పకుండా ఇస్తామన్నారు. అనాథ గృహ చైర్మన్ శశిమోహన్, సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్, డైరీ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, జనరల్ మేనేజర్లు మధుసూదన్‌రావు, మల్లికార్జునరావు, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యల పరిష్కారానికి కృషి: చల్లా నర్సింహారెడ్డి



కాలనీలో పర్యటిస్తున్న టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీయూఎఫ్ఐడీసీ చైర్మన్, రంగారెడ్డి డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన జిల్లెలగూడలోని గౌతంనగర్, ఆదిత్యానగర్, టీఆర్ఆర్ టౌన్‌షిప్, సాయినగర్, ఎన్‌బీఆర్‌కాలనీ, లలితానగర్, విజయా హోమ్స్ రాఘవేంద్రనగర్ తదితర కాలనీల్లో మునిసిపల్ కమిషనర్ జ్ఞానేశ్వర్, వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయా కాలనీల ప్రతినిధులు చల్లా దృష్టికి తీసుకువచ్చారు. రోడ్లు అభివృద్ధి చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వారు ఆయనను కోరారు. అనంతరం చల్లా మాట్లాడుతూ సమస్యలపై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చిన్న చిన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కమిషనర్‌తో పాటు ఇతర అధికారులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ చల్లా కవితాబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బైగల్ల బాలమణి, తీగల మాధవీసాయినాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పల్లె పాండుగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సిద్దాల దశరథ, కాంగ్రెస్ నాయకులు ఎ.సురేందర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, ఆయా కాలనీల ప్రతినిధులు వెంకట్ రెడ్డి, శేఖర్‌రెడ్డి, బాల్‌రాజు, సాంబశివరావు, ప్రభాకర్‌రావు, రాజేశ్వర్‌రావు, లింగారెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి, సురేందర్, మురళీధర్ పాల్గొన్నారు.



అంత్యక్రియల దృశ్యం

అభాగ్యుడికి అంత్యక్రియలు

సరూర్‌నగర్: బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్‌లో గల మాతృదేవోభవ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న శంకర్ అనే అభాగ్యుడు అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. ఏడాది క్రితం నగరంలోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో పిచ్చోడిలా తిరుగుతున్న శంకర్‌ను స్థానికుల సమాచారం మేరకు గిరి చేరదీసి తన ఆశ్రమంలో చేర్చుకుని సేవలు చేశారు. కాగా కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్ ఆరోగ్యం క్షీణించడంతో ఆదివారం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే తుదిశ్వాస విడిచాడు. విషయం తెలుసుకున్న బడంగ్‌పేట్ కౌన్సిల్ బీజేపీ మాజీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి దహన సంస్కారాలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని ఆశ్రమం నిర్వాహకుడు గిరికి అందజేయగా, ఆయన ఆశ్రమంలోని మిగతా అభాగ్యులతో కలిసి అంత్యక్రియలు నిర్వహించారు.



నూతనంగా ఎన్నికైన రెడ్డి సంఘం ప్రతినిధులు

బాలాపూర్‌చౌరస్తా రెడ్డి సంఘం కార్యవర్గం ఎన్నిక

సరూర్‌నగర్ : మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ క్రాస్ రోడ్డు(బాలాపూర్ చౌరస్తా) పరిసర ప్రాంతాలకు చెందిన రెడ్డి వర్గీయులు నూతన సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పన్నాల తులసిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తకాపు పరమారెడ్డి, ఉపాధ్యక్షులుగా కళ్లెం వెంకట్‌రెడ్డి, గోనె కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామస్వామి నరేందర్‌రెడ్డి, కోశాధికారిగా కొత్త రాజేశ్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా కొండా రవీందర్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

బుల్లెట్ ప్రూఫ్ వాహనం..

1+4 భద్రతా సిబ్బందిని వినియోగించుకోండి

- రాజాసింగ్‌కు లేఖ రాసిన మంగళ్‌హాట్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని వినియోగించాలని, ప్రభుత్వం కల్పించిన 1+4 భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు సిటీ పోలీసులు మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళ్‌హాట్ పోలీసులు ఆదివారం లేఖ రాశారు. మే-31న శనివారం సాయంత్రం 5 నుంచి రాత్రి 7గంటల వరకు మత విద్వేశాలు రెచ్చగొట్టే అవకాశాలు ఉన్న ప్రాంతాలైన తలాబ్‌కట్ట, భవానీనగర్, ఇంజన్ బౌలి, బాబానగర్, బహదూర్‌పురా, సంతోష్‌నగర్, యాకతుపురా, గోల్కొండ, జిర్రా ప్రాంతాల్లో రాజాసింగ్ ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోకుండా పర్యటించారు. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ఇప్పటికే ఆయనకు వస్తున్న బెదిరింపులను, శత్రువులతో ఉన్న ప్రాణహానిని దృష్టిలో పెట్టుకొని రక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా మరోసారి విజ్ఞప్తి చేస్తూ లేఖ రాశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

సరూర్‌నగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లెలగూడలోని చల్లా లింగారెడ్డి జడ్పీహెచ్ఎస్‌లో 2007-08లో పదోతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, గణేశ్, శోభన్‌ను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు నాటి అనుభవాలను నెమరువేసుకున్నారు.

నేడు రైతులకు విత్తనాల పంపిణీ

రాజేంద్రనగర్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఈనెల 2వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆడిటోరియంలో రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు ఆదివారం అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ శాఖ కమిషనర్, డైరెక్టర్ డాక్టర్ బి.గోపి, వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య హాజరై రైతులకు విత్తనాలు అందజేస్తారని పేర్కొన్నారు.

విత్తన వారోత్సవాల్లో భాగంగా..

ముందుగా ప్రకటించిన మాదిరిగా, విత్తన వారోత్సవాల్లో భాగంగా జూన్ 3వ తేదీ నుంచి వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వివిధ కేంద్రాల నుంచి రైతులకు వివిధ పంటల విత్తనాలను అందజేయడం జరుగుతోందన్నారు. వరి, కంది, మొక్కజొన్న, పెసర, మినుము, ఆముదం, చిరుధాన్యాల పంటలకు సంబంధించిన సుమారు 8,500 క్వింటాళ్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. విత్తన వారోత్సవాల్లో భాగంగా సంబంధిత కేంద్రాల నుంచి జూన్ 3వ తేదీ నుంచి కొనుగోలు చేయవచ్చన్నారు.

విత్తన విక్రయ, పంపిణీ కేంద్రాలు ఇవే..

- రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో వరి, మొక్కజొన్న విత్తనాలు అందుబాటులో ఉంటాయని, వాటి కోసం 94402 25385 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.
- రాజేంద్రనగర్‌లోని విత్తన పరిశోధన సాంకేతిక కేంద్రంలో వరి విత్తనం అందుబాటులో ఉంటోందని, 8639975840 నెంబర్‌లో సంప్రదించి విత్తనాలు తీసుకోవచ్చన్నారు.
- పాలెం ప్రాంతీయ పరిశోధనా కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రంలో వరి, జొన్న, కంది, ఆముదం విత్తనాలు అందుబాటులో ఉంటాయన్నారు. వాటి కోసం 9705069580 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.
- కంపాసాగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం, కృషి విజ్ఞాన కేంద్రంలో వరి అందుబాటులో ఉంటుందన్నారు. దాని కోసం 9492396001 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.
- తాండూర్ వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది, జొన్న, కుసుమ విత్తనాలు అందుబాటులో ఉంటాయని, వాటి కోసం 9885040499 నెంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

నాగిరెడ్డి హత్య కేసులో నిందితుడి కోసం రెండు పోలీసు బృందాల గాలింపు

చాదర్‌ఘాట్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని వైష్ణవి మౌక్తిక అపార్ట్‌మెంట్‌లో పార్కింగ్ విషయంలో జరిగిన వివాదంలో నాగిరెడ్డి హత్యకు కారకుడైన నిందితుడు జువ్వాజి కృష్ణను పట్టుకోవడానికి చైతన్యపురి పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. హత్య అనంతరం జువ్వాజి కృష్ణతోపాటు అతని అత్త కామాక్షి ఇంటికి తాళం వేసి పరారైన విషయం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రి నివాసులైన జువ్వాజి కృష్ణను పట్టుకోవడానికి రెండు పోలీసు బృందాలను రంగంలోకి దింపారు. హత్య జరిగిన వెంటనే చైతన్యపురి పోలీసులు స్పందించకపోవడం వల్లే నిందితుడు కృష్ణ పరారైనట్లు అపార్ట్‌మెంట్ వాసులు విమర్శిస్తున్నారు. ఇదిలా ఉండగా చైతన్యపురి పోలీసులపై రాచకొండ పోలీసు కమిషనరేట్ నుంచి వచ్చిన ఒత్తిడి మేరకు నిందితుడిని పట్టుకోవడానికి నిందితుడు కృష్ణతోపాటు అతని అత్త కామాక్షి కాల్ డేటా వివరాలను సేకరిస్తున్నారు. హత్యకు ముందు, హత్య జరిగిన తర్వాత కృష్ణ అతని అత్త కామాక్షి ఎవరెవరితో ఫోన్‌లో మాట్లాడారనే వివరాలను సేకరిస్తున్నారు. వారిచ్చిన వివరాల ఆధారంగా నిందితుడు రాజమండ్రికి పారిపోయాడా లేక నగర శివారులోనే ఉన్నాడా అనే వివరాలు సేకరించి వాటి ఆధారంగా రెండు బృందాలు గాలిస్తున్నాయి. రాజమండ్రిలో కాదు నగర శివారులోనే ఉన్నట్లు చైతన్యపురి పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఒకటి రెండు రోజుల్లో నిందితుడు కృష్ణను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.



కన్నీటి పర్యంతం అవుతున్న చనిపోయిన ఇంజనీరింగ్ విద్యార్థి తల్లిదండ్రులు

కుమారుడి మృతిపై విచారణ జరిపించాలి

- తల్లిదండ్రులు భాను ప్రతాప్, రజనీ డిమాండ్

బర్కత్‌పుర, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భూదాన్ పోచంపల్లి దేశ్‌ముఖ్ గ్రామంలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న తమ కుమారిడి మృతిపై పూర్తి విచారణ జరిపించాలని మృతుడి తల్లిదండ్రులు బొడ్డు భానుప్రతాప్, రజనీ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2వ తేదీన యూనివర్సిటీకి వెళ్లి ఇంటర్నల్ పరీక్ష రాసిన తరువాత తమ కుమారుడు శ్యామ్‌చరణ్, మరో విద్యార్థి జతీన్ యూనివర్సిటీ పక్కన ఉన్న క్వారీగుంటలో పడి చనిపోయారని యూనివర్సిటీ యాజమాన్యం సాయంత్రం 6.30గంటలకు తమకు సమాచారం ఇచ్చారని, వాస్తవంగా ఈసంఘటన 12.30గంటలకు జరిగినట్లు తమకు తెలిసిందని, తమ కుమారుడి వెంట ఉన్న మరో ముగ్గురు విద్యార్థులను పోలీసులు యూనివర్సిటీ యాజమాన్యం ఇంత వరకు విచారించలేదని వారు ఆరోపించారు. తమ కుమారుడి మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని, పూర్తి స్థాయిలో విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని వారు స్పష్టం చేశారు. తమ కుమారుడు చనిపోయి బాధలో ఉంటే అవమానకర రీతిలో మాట్లాడిన విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈవో శ్రావణ్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని, యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

విజ్ఞాన్ యూనివర్సిటీ యాజమాన్యంపై ఫిర్యాదు

దళిత విద్యార్థి బొడ్డు శ్యామ్‌చరణ్ మృతిపై మానవహక్కుల కమిషన్‌లో ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి బైరి రమేష్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఇంజనీరింగ్ విద్యార్థి చనిపోయి రెండు నెలలు కావస్తున్నా యూనివర్సిటీ యాజమాన్యం, పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి విన్నవిస్తామని వారు తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు తమ పోరాటం ఆగదని, అన్ని సంఘాలను కలుపుకొని విజ్ఞాన్ యూనివర్సిటీ ఎదుట ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో మాల మహానాడు నేతలు నర్సింగ్‌రావు, మహేందర్, పరుశురాం, మహేశ్వరి, ఇందిరా ప్రియదర్శిని, బుజ్జిబాబు, రవికాంత్ పాల్గొన్నారు.